# అయిన సంబంధం

సుభద్రకి ముప్పైయో ఏట భర్త పోయాడు. ఎక్కడఉన్నా ఒక్కటే అయినప్పటికీ కాస్త చేదోడు వాదోడుగా ఉంటుందని తన అన్న సుబ్బారావు స్కూల్ మాస్టరీ చేస్తున్న ఊరు వచ్చేసింది, ఉన్న కొద్దిపాటి ఆస్తిని పట్టుకుని. అన్న అయితే తమ యింట్లోనే ఉండమన్నాడుగాని, వదిన సుందరమ్మకు ఇష్టంలేదన్న సంగతి సుభద్రకు తెలుసును. కాక, వాళ్ళింట్లో ఇప్పటికే ముగ్గురు చిన్నపిల్లలున్నారు. తన ఒక్కగా నొక్క కూతురు జానకికి తగినట్లుగా ముద్దు జరపడానికి వీలుంటుందా? ఇంతకీ కొన్నాళ్ళు కలిసివుండి తరవాత కలిసి ఉండలేకపోయారు అని మాట పడేకంటె మొదటే వేరుండటం మంచిది అని సుభద్ర నిర్ణయించుకుంది. వాళ్ళింటికి నాలుగైదు ఇళ్ళ దూరములోనే అన్ని వసతులూ కలిగిన ఇల్లొకటి సరిగా సమయానికి ఖాళీ అయింది.

అన్నదమ్ముడు సుబ్బారావు రోజూ ఉదయమో సాయంత్రమో ఏదో ఒక వేళప్పుడు వచ్చి, చెల్లెలినీ మేనకోడలినీ చూసిపోతూ ఉండేవాడు. తమ ఇంటికి బజారునుండి వస్తువులు తెచ్చుకున్నప్పుడు చెల్లెలిగారింట్లో కావలసినవి కూడా తెచ్చి పడేస్తూండేవాడు.

ఇలా, ఏ చీకూ చింతా లేకుండా, మనస్సుని కలవరపెట్టే సమస్యలు లేకుండా సృష్టిలయకాలం వరకూ జరిగిపోయినా బాధ లేదన్నట్టుండేది సుబ్బారావుకి. ఏమంటే అతనికి రెండు మూడేళ్ళ క్రితం వరకూ జీవితంలో ప్రతీదీ పెద్ద సమస్య అయి కూర్చుంది. మిడిల్ స్కూల్ దాటిన దగ్గరనుండీ చదువుకు ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం జరుగుతుందో జరగదో అనుమానమే. తరువాత ఉద్యోగాలూ అంటే, ఏమో తన అదృష్టం, అన్నీ ఎన్నాళ్ళుంటాయో తెలియని ఉద్యోగాలే. ఎలాగయితేనేం ఇప్పటికి స్థిరపడ్డట్టే. ట్రెయినింగు కూడా అయిపోయింది. ఇక తనను కదిపేవాడెవడూ లేడు. మ్యునిసిపాలిటీ నౌఖరీ గనక బదిలీల బాధ అసలే లేదు. ఇటువంటి తృప్తిని అనుభవిస్తున్న హాయి అయిన కాలంలో ఇంకొక సమస్యవచ్చి పడింది సుబ్బారావుకి.

అతను వెళ్ళినప్పుడల్లా సుభద్ర మంచినీళ్ళిచ్చి కాఫీగిన్నె కుంపటిమీద పెట్టి అందుకొనేది. 'అన్నయ్యా, చూడు ఎందుకు మేనరికం అయితేనేం, ఈ రోజుల్లో అందరూ చేసేస్తున్నారు. అసలు మనవాళ్ళలోనూ మేనమామలకే పిల్లనిచ్చేస్తున్నప్పుడు దీనికేం తప్పొచ్చింది. వాళ్ళిద్దరికీకూడా ఈడు జోడు బాగా కుదిరింది. మా జానకికి పదకొండు వస్తున్నదా, మీ సీతాపతికి పద్నాలుగు వెళ్ళి పదిహేను రేపు దశమినాటికి వస్తుంది. అయినా ఆ సంఘటన కాకపోతే వాళ్ళిద్దరి పేర్లు కూడా చూడు, ఎంత చక్కగా కుదిరాయో; జానకి అంటే సీతాదేవి పేరేకద. అప్పుడు ఆయన సీత అనే పేరు పెడదామన్నారు. నేనే మరీ చిన్న పేరయిపోతుందని జానకి అందామన్నాను. ఇది మనకి అన్నివిధాలా అయిన సంబంధం. చేతికీ నోటికీ ఎంగిలి లేనిది. ఇది ఒదులుకుని పైకి వెళ్ళడం ఎవరికీ శ్రేయస్కరం కాదు. వాళ్ళిద్దరికీ ఒకే బావా అంటే ఒకే జానకీ అనుకునే చనువుంది. ఇటువంటి ఈ అన్యోన్యం లక్షరూపాలిస్తే మటుకు వస్తుందా? ఇప్పటినుంచి చిన్న పిల్లలు వాళ్ళ పెళ్ళికేం తొందరంటావు. ఏదో ప్రధానం అని చేసుకుంటే నిబ్బరంగా వుంటుంది. నాకూ ఓమారు నాలుగు పుణ్యక్షేత్రాలు సేవించుకుని రావాలని వుంది. అయినా ఏంచేస్తున్నా మనసుకి దీనిపెళ్ళి గురించిన ఆలోచన ఉంటున్నంతకాలం శాంతి లేదు. అందుచేత మనం ఇదేదో ప్రధానం జరిపేసుకొంటే నామానాన నేను యాత్రలకి పోతాను. ఆర్నెల్లవుతుందో ఏడాదే అవుతుందో నేను తిరిగి వచ్చేసరికి. అది మీ యింట్లోనే ఉంటుంది ఎప్పటికయినా దాని కదే శాశ్వతం కదా" మధ్య మధ్యను చిన్న చిన్న అవాంతరాలు వచ్చినా ఈ ఆమె ఉపన్యాసం అతను కాఫీ త్రాగి మరి నేను వస్తాను సుభద్రమ్మా అని లేచే లోపుని పూర్తయేది, మాటల పేర్పులో కొద్ది భేదం ఉన్నా ప్రధానంగా ఆమె ఉపన్యాస సారాంశం, ధోరణీ ఇదే.

చెల్లెలు మాటలు విని ఇంటికి వస్తున్నప్పుడు సుబ్బారావుకి వాటిలోని సబబు అతి స్పష్టంగా కనిపించేది. కాక ఇప్పుడిది కాకపోతే జానకి పెళ్ళి సంబంధం గురించి తానే తిరగవలసి ఉంది. కాక సీతాపతికి మాత్రం ఇంతకంటె మహా గొప్ప సంబంధం వస్తుందేమిటి? ఎక్కువ లేకపోయినా ఆ వున్న కొంచెమయినా వాళ్ళ ఆస్తి వీడికి దక్కుతుంది. అధనం వాడి కాలేజి చదువు తన తాపత్రయం అక్కరలేకుండా జరిగిపోతుంది.

ఇటువంటి ఆలోచనలు పెట్టుకుని వచ్చిన సుబ్బారావు, ఎలాగో సందర్భం కల్పించుకొని భార్య సుందరి దగ్గిర ప్రసంగం ఎత్తేవాడు.

ఆమె కూడా ఏమీ సుభద్రకంటె తక్కువ చదువుకున్నది కాదు.

"ఏం నా కొడుక్కి పెళ్ళి కాదనా ? లేక అప్పుడే వయస్సు మీరి పోయిందనా ? పదమూడేళ్ళ నాగమ్మకి పెళ్ళి సంబంధం కుదుర్చుకొచ్చారట, పెళ్ళి సంబంధం ! అదీ ఎదురు మేనరికం. నలుగురు హాస్యంచేసయినా కాకపోవాలా ? తన అన్నం తను తిని తనబట్ట కట్టి లోకులకి వెరవాలన్నారు పెద్దలు. ఎవళ్ళో ఎక్కడో చేశారని మనం చెయ్యాలా ? అలా అయితే ఏ వర్ణాంతరపు పెళ్ళో, జాత్యంతర వివాహమో చెయ్యరాదూ ? పేరుకి పేరూ ఉంటుంది. పెద్ద కట్నం అయినా వస్తుంది. అంతేగాని, ఇదేమిటండీ, ఒక పండగ అనీ పబ్బమనీ అచ్చటా జరగాలా ? ముచ్చటా జరగాలా ? ఆ స్థితి, ఆ శక్తి అటు పాపం మీకేమో ఆశే, కాని, మహా ఎంత గనక !" ఎక్కడలేనిదీ ఆమె కాఫీకి, తమలపాకుకీ చాలదు. కాఫీ పదిమార్లయినా ఉండాలి, తమల పాకులు సరేసరి. అవి వేసుకోని సమయమే ఉండదు. మాన్తా ఉండదు, ఒక్క పదేళ్ళ నాటికి ఒక దమ్మిడీ అయినా మిగిత్తే అప్పుడు నన్నడగండి—మరో సంగతి, మీరు మీ ఇరవయ్యో యేట పెళ్ళి చేసుకొని 'ఈ పెళ్ళామూ పిల్లలూ వీళ్ళ వల్ల నేనా అభివృద్ధి అంతా తగలడిపోయింది. దేనికీ తీవ్రంగా ప్రయత్నించ బడదు. ఏ రోజు నౌఖరి పొయ్యేకపోయినా గడిచేదిలేదు. ఇంతే మరి అదృష్టం లేద' అప్పుడు పెళ్ళి చేసుకోవడంలో ఎన్ని ఇబ్బందులున్నాయని గుర్తించ లేకపోయాను. అని వగస్తూ ఉండేవారే నిన్న మొన్నటిదాకా. అటువంటిది మీరే వాడి మెడలో ఇప్పటినుంచీ ఒక బండ తగిలించేస్తారా ? మీకు ఇరవయ్యోయేట పెళ్ళయిందిగాని, వాడికి ఆ వయస్సుకి ఒకళ్ళిద్దరు పిల్లలుకూడా పుట్టవచ్చును. అప్పుడు మీరే ఎంత కాలమని నేను పోషిస్తాను అని కేకలు వెయ్యవచ్చునా ?

ఇప్పుడు వాడికి స్కాలర్‌షిప్పు ఉంది. వాడి చదువుకి మీరేం కష్ట పడిపోడం లేదు. తరవాత వాడి కాలేజీ చదువుకా, ఈ ఒక్క గొలుసు వుంది నన్ను రక్షిస్తుందా ? ఇది అమ్మి వాడికి నేను చదువు చెప్పించు కుంటాను. అందుచేత మీరేం తొందరపడి నిశ్చయం మాత్రం చేసుకురాకండి. మీ పుణ్యం వుంటుంది.

ఏదో ఆమాత్రం ఇది వుంచి నన్నడిగారు కనక చెప్పాను. కాని. నా మాట మీ కేం కావాలా ఏం ? మీ అన్నదమ్ముడూ అక్క చెల్లెలూ ఒకటే. నేను పైదాన్ని. మీ యిష్టం ఏం చేసుకుంటారో" అని గిరుక్కున అవతల

ఏదో తొందర పని ఉన్నట్టు వెళ్ళిపోయేది. తన మాటకు వీసమంతయినా రాసిరాదన్న నమ్మకంతో.

సుబ్బారావుకి తన భార్య మాటలోని ఔచిత్యము వెంటనే స్ఫురించేది కాని సుభద్ర దగ్గర ఉన్నప్పుడే "నిజమే ఈమె చెప్పినదాంట్లో ఏం పొరపాటుంది?" అనిపించేది.

కొన్నాళ్ళపాటు ఇప్పుడూ అప్పుడూ అని ప్రధానానికి వాయిదాలు వేసి, తరువాత ఎలాగో నిబ్బరం తెచ్చుకుని 'చూడు సుభద్రమ్మా ఇప్పుడు ప్రధానం చేసినా వాడికి పద్ధెనిమిదేళ్ళూ దానికి పధ్నాలుగేళ్ళూ వయస్సు వచ్చేదాకా పెళ్ళి చెయ్యడానికి వీల్లేదుకదా. ఇప్పుడు మనలో మనం అనుకొన్నకంటె ఏం ఎక్కువకాదు కదా! మరి నలుగురు సాక్షులు కూడా ఎందుకు ఈ భాగ్యానికి. కాక, మనం అనుకోకూడదుగాని, ప్రధానం అయాక ఏవేవో అవాంతరాలు వచ్చి తిరిగిపోయిన సంబంధాలు మన కళ్ళతో మనం అనేకం చూశాం. ఏమో నాలుగేళ్ళ తరువాత సంగతులు ఎవరు చెప్పగలరు? అయినా వాడికి ఇంట్లో సంబంధం ఉండగా నేను మరోకచోటు ఒప్పుకోను కదా. అంచేత ఇప్పుడెందుకు తొందరపడడం అని'

అతనిచేత వెనకనుండి ఈ మాటలు అనిపిస్తున్న శక్తి ఏమిటో సుభద్ర గ్రహించుకుంది. మరి ప్రస్తుతానికి ఏమనుకొన్నా ఏమన్నా లాభంలేదని మాట్లాడకుండా ఊరుకుంది.

పూర్వం శ్రీరామచంద్రుడు అశ్వమేధయాగం నిర్విఘ్నంగా సమాప్తం చేసుకొన్న చక్రవర్తి పొందిన హాయిని అనుభవించాడు తాత్కాలికంగా సుబ్బారావు ప్రస్తుతానికి ఈ సమస్య వదిలిపోయినందుకు.

౨

నాలుగేళ్ళ తరువాత: సుందరి అతి దిగులుగా మొగం పెట్టి. 'నాకేం బాధ్యత లేదు అంతా నీదే తప్పు' అనడం మీకు బాగా తెలుసును అంది.

సుబ్బారావు: 'నే నేమిటో అన్నానసే నీ ఏడుపుగాని వాడు చెడ్డాడని లేదుకదా. నువ్వే మొదటినుంచీ వాడిని చెడగొట్టావు, నాకు తెలియకుండా రెండూ మూడూ ఇచ్చి'

'అక్కడికి మీరు చేసిన మహా బాగేమిటోకదా. ఊరువాళ్ళ పిల్లలకి ట్యూషన్లు చెప్పినపాటి శ్రద్ధ వాడి చదువుమీద ఉంది. వాడేదో బొమ్మలు

గీస్తే, ఓహో ఇంతవాడవుతాడు అంతవాడవుతా డన్నారు. నేను నిజమే అనుకొన్నాను.

"పోనీ అదయినా తిన్నగా చేస్తేనా ? ఆఖరికి సైను బోర్డులు రాసుకున్నా రోజుకి ఒక మూడూ నాలుగూ కిట్టకపోవు. ఎందునూ కాకుండా అయిపోయాడు. వెధవ సావాసాలూ వీడున్నూ.

"మీరలా వాణ్ణి ఇంటికి వచ్చినప్పుడల్లా చెదరగొట్టబట్టే వాడిలా అయిపోయాడు. వాడికసలు మీరుండగా ఇంటికి రావడమంటేనే బెంగపట్టుకుంది. మనవాడిని మనమే కాదనుకుంటే ఊళ్ళో వాళ్ళేమంటారు ?"

"ఇప్పుడు నే ననడంవల్లే వాడు చెడిపోయాడనికదూ. సరే, నాకేం పోయింది. నే నేమీ అనను. వాడిష్టం ఇంట్లో ఉన్నా ఎక్కడికయినా వెళ్ళినా సరేనా? "

"అంత నా పూచీ ఏమిటని కూర్చుంటే ఎలాగండీ? వాడికి పద్ధెనిమిది నిండాయి. పెళ్ళి అంటూ చేసేస్తే, వాడి బాధ్యత వాడికే మోస్తుంది. పెళ్ళయితేమట్టుకు కేం చదువుకోవద్దంటుందా ? ఏమంటారు, ఈ మాఘంలోనే అయిపోతే."

"తలవగానే తాతకి పెళ్ళా. అసలు వాళ్ళంతట వాళ్ళు ఎవళ్ళయినా ఇస్తామంటూ రావాలిగాని మనంతట మనం వెళ్ళితే ఏం లోసుగుందో అనుకుంటారు. కాక మనవాడు స్కూలుఫైనలయినా ప్యాసు కాలేదు."

" ఈ సంవత్సరం కాకపోతే మళ్ళీ సంవత్సరం ప్యాసవుతాడు. కాక ఇంట్లో సంబంధానికి ఇన్ని ఆలోచించినవారిని మిమ్మల్నే చూశాను. ఇదివరకే అయిపోయి ఉంటే అప్పుడీ పరీక్ష పోవడం యేమయినా అడ్డునా ? ఇవాళ మంచి రోజు, ఇప్పుడు వర్జ్యం అదీ లేదు. వెళ్ళి ఇప్పుడే ఆవిడతో మాట్లాడి నిశ్చయం చేసుకురండి. ఒచ్చే నెలలోనే గొప్ప ముహూర్తాలున్నాయిట !"

సుబ్బారావు మెదడులో వెనక తన చెల్లెలుగారి సంబంధం గూర్చి సుందరి చెప్పిన అభ్యంతరాలన్నీ తళుక్కుమన్నాయి. "అప్పుడు పనికిరానిది ఇప్పుడెలా పనికి వస్తుంది" అనాలని నాలిక చివరివరకూ వచ్చింది. కాని సర్దుకున్నాడు. ఇదేమీ కేవలం తన భార్య ఒక్కతెకూ సంబంధించిన సంగతి కాదు. కాక ఇప్పుడు ఆమె వెనకటి తెలివితక్కువని ఒప్పించినందువల్ల తను

సాధించగలిగేదేమిటి? అసలే విచారంగా ఉన్న మనిషిని మరింత బాధ పెట్టడం తప్ప.

వెళ్ళడమేమో వెళ్ళాడు. కూర్చున్నాడు. కాఫీ త్రాగాడు. అంతసేపూ చెల్లెలు, తన కూతురు స్కూలులో పొందిన బహుమతుల గురించీ సంగీతపు పాండిత్యం గురించీ ఇంకా ముందు ముందు చదివించబోయే చదువుల గురించే చెపుతూంటే పరధ్యానంగా వింటూ, అంతసేపూ అతడు ఆలోచిస్తూనే ఉన్నాడు, తన ఉద్దేశాన్ని యే రకంగా బైట పెట్టడమా అని. కొంతసేపు పోయాక, మరి ఇప్పుడు లాభంలేదు. రేపు శనివారంనాడో ఆదివారంనాడో మధ్యాహ్నమే తీరుబాటుగా వచ్చి మాట్లాడాలని.

ఇంటికి తిరిగిరాగానే ప్రశ్న. "అదా మరిచిపోయేను సుమా. పల్లే దానికేం, రేపో ఎప్పుడో" అన్నాడు.

ఇక మరి ఈ రాయబారాలు లాభంలేదని సుందరి తరువాత రెండు రోజులనాడు తానే స్వయంగా బయలుదేరింది తన పెళ్ళినాటి సిల్కు చీర కట్టుకుని.

వెళ్తూనే "యేదీ మా కోడలు" అన్నట్టుగా ప్రసంగం ఆరంభించింది.

కాని, యేమో సుభద్రమ్మ అంత ఇష్టపడినట్టు లేదు. చాలాసేపు ఇద్దరూ అతి నేర్పుగా అవతలివాళ్ళను చిత్తు చేస్తున్నామనుకుంటూ మాట్లాడిన మీదట వ్యవహారం తేలిపోయింది. సుభద్రమ్మ అంది. మా జానికమ్మకి ఇప్పటి నుంచీ పెళ్లి చేసుకోవాలని లేదు. దాని స్కూలుఫయినలు ప్యాసయి తీరాలట. మన కాలంలాగా యేమిటి, పెద్దవాళ్ళు చెప్పినట్టు వినడానికి. ఇప్పుడంతా వినడానికి వాళ్ళ ఇష్టమే. కాక సంగీతం కూడా మొదలుపెట్టిన ఈ ఆరు నెలల్లోనూ ఇంత క్షుణ్ణంగా ఇంత గ్రంథం ఎవరికీ రాదని వాళ్ళ మాష్టరంటు న్నాడు. ఇదేదో స్కూలుఫయినలయ్యేసరికి అది పూర్తవుతుంది. ఇంకా ఏదీ ఇప్పుడు దానికి పధ్నాలుగేకద. అసలే అర్భకపు పిల్ల. అప్పటికి పదహారేళ్ళు వస్తాయి. అప్పటికి మా మేనల్లుడి బి ఏ. కూడా పూర్తవుతుంది కాబోలు.

తను కుర్రవాడి చదువు చెడిపోయిందని తెలిసే ఇలాగ తనను నొప్పించడానికే అందన్న సంగతి సుందరికి తెలుసును. కాని, ఇప్పుడు తానేమీ అనే స్థితిలో లేదు. అసలు తనంతట తాను అడగరావడం తనదే బుద్ధి తక్కువ. కాక, యేదో చిన్నతనం, సరదాలలో పడ్డా, సీతాపతి దారిని పడకూడదా? నవ్విన ఊళ్ళే పట్నాలవుతాయి అనుకొంటూ ఇంటికి వచ్చేసింది.

# 3

పదిహేనేళ్ళు నిండి పదహారవ ఏడాది వస్తుందనగా జానకి స్కూలు ఫైనలు ప్యాసయింది. తననోట తాను సీతాపతికి యివ్వనని చెప్పలేక అన్నదమ్ముల్ని పెళ్ళి సంబంధాలు వేరే చూడమంటే ఏం బాగుంటుంది. తానే స్వయంగా ప్రయత్నాలు ప్రారంభించింది సుభద్ర. చాలా సంబంధాలు ఏదో లాగున్నాయి, తనకే యిష్టపడలేదు. ఇక తాను బాగున్న సంబంధాలు అనుకొని ప్రయత్నించినచోట కట్నాల ఆశ విపరీతంగా ఉంది. తనదగ్గర ఉన్నదంతా రెండు వేలకంటే లేదు. ఇదంతా వెచ్చపెట్టేసుకొంటే తను తరవాత కూతురు అల్లుడూ వాళ్ళమీద ఆధారపడాలి. తరవాత ఎన్ని చిక్కులు వస్తాయో.

తను అప్పుడంటే అనుకొందిగాని సీతాపతి ఇప్పుడు బుద్ధిగా చదువుకొంటున్నాడట. ఇంటర్మీడియేటులో ప్రవేశించాడు. ఇక బి.యే. ఎలాగయినా అయిపోతాడు. ఇంతకంటే దూరపుకొండలు నునుపుగాని, తక్కిన సంబధాల ఎక్కువేమిటి మహా. ఇంతకీ అమ్మాయికూడా తక్కిన కొన్ని సంబంధాల విషయంలో చెప్పినట్లు నాకక్కర్లేదు, నాకిష్టంలేదు. అనలేదు. 'ఏమోనీయిష్టం నాకేం తెలియదండి' —అంటేదానికి బాగా ఇష్టం ఉన్నట్టేకదూ. అనుకొని నిర్ధారణ చేసుకొని - మరి అన్నయ్యతో మూజువాణి మాటలెందుకని, తానే బయలు దేరింది వదినతో మాట్లాడటానికి. ఈమారు తనకేమి అనుమానంలేదు, తను ఇలా సూచన చేసేసరికి వదిన ఎగిరి గంతేస్తుంది

"యేమిటో వదినా వాడేం తిన్నగా చదువుతాడని నమ్మకంలేదు. ఇప్పుడున్న శ్రద్ధ తరువాత ఉంటుందో ఉండదో. అయినా బి. యే. ప్యాసయే దాకా పెళ్ళి చేసుకోనంటున్నాడు. అసలే శ్రద్ధ తక్కువ, సరదా లెక్కువ వాడికి. అటువంటిది ఇక పెళ్ళంటూ అయితే మరి చెప్పాలా? ఇంతకీ నా పెత్తనమేముంది. మీ అన్నయ్యగారూ మీరూ ఆలోచించుకోండి" అని వదిన అనడంతో సుభద్రకు తల దిమ్మెక్కి పోయినట్టయింది. పిల్చి పిల్ల నిస్తామంటే కులం తక్కువన్నారంటే వింతేముంది అనుకుంటూ ఇంటికి వచ్చేసింది. ఇప్పుడిదంతా వదిన సుందరి చేస్తున్న అన్యాయమే అని గాని, వెనుక తానూ ఒకప్పుడిలాగే అంది. అన్న విషయం ఆమె ఆలోచన పొలిమేరలకు రాలేదు.

# ౪

తల్లి అలా యేవో ప్రయత్నాలు చేస్తుంది. కాని, ఇంటి దగ్గర యే పని లేకుండా చదువు లేకుండా ఉండడం కష్టమనిపించి జానకి వాళ్ల స్కూలు మిస్ట్రెసులలో ఒకావిడ సలహా సహాయమూ మూలంగా ట్రెయినింగుకి సీటు సంపాదించి, ఎలాగో తల్లిని ఒప్పించి ప్రవేశించింది. మొదట్లో కొంత కష్టంగా తోచినా, సుభద్రకు కూతురును వదిలి ఉండడంకూడా అలవాటయిపోయింది. జానకి ట్రెయినింగు ప్యాసయి రాగానే తాను చదువుకున్న స్కూలులోనే మిస్ట్రెసు పని దొరికింది.

సీతాపతి ఇంటర్మీడియేటు చదివే రోజుల్లో దగ్గర సంబంధం ఉన్నా ఎదురు మేనరికం అని చేసుకోరు. అందుకే ఆ అమ్మాయి ట్రెయినింగుకి వెళ్ళిపోయింది. అని రూఢి పడిపోయాక, అనేక సంబంధాలు వచ్చాయి. సుందరికి ఇదంతా తన తెలివితేటల ఫలితమే అన్న విపరీతమైన తృప్తి కలుగుతూండేది. భర్తతో సగర్వంగా వీళ్ళింత కట్నమిస్తామంటున్నారు, వాళ్ళింత ఇస్తామంటున్నారు అని చెప్పేది. కాని ఎప్పటికప్పుడు ఎవరయినా ఫలానా ఇంత కట్నం ఇస్తామంటే ఇంతేనాఅని అనిపించేది. మరికొద్దిగా ఎక్కువ ఇవ్వకూడదా? కాక బి. ఏ. ప్యాసయితే ఇంకా మరింతరాదు? అసీ ఇప్పుడు తీరా ఒప్పుకొంటే తరవాత విచారించవలసి వస్తుందేమోనని ఉండేది. సుబ్బారావు అప్పుడప్పుడు అంటూ వుండేవాడు. నువ్వింతలా ఆలోచిస్తే ఎప్పటికీ నిర్ణయానికి రాలేవు. తరవాత మళ్ళీ ఆకులు పట్టుకుంటే లాభంలేదు. —"పోనీయండి అప్పుడు మీరున్నారుకాదా, దిద్దడానికి' అని సగర్వంగా అనేది.

నిజంగా సీతాపతికి ఇంటర్మీడియేటులో చాలామంది పస్టుక్లాసు వచ్చిన వాళ్ళకంటే ఎక్కువ మార్కులే వచ్చేయి. కాని, దురదృష్టం, ఇంగ్లీషులో పోయింది. అంతే, తరవాత మరి శ్రద్ధలేకపోయింది. మరొకమారు బలవంతంచేసి కట్టమంటే కట్టేనని, ఇంకొక సెంటరుకి కట్టేనని డబ్బు ఖర్చుపెట్టాడే కాని పరీక్షకే కూర్చోలేదు. సుబ్బారావు నేను మరొక దమ్మిడీ అయినా ఇవ్వనన్నాడు. సుందరికీ గట్టిగా ఏమనడానికీ తోచలేదు. నెమ్మదిగా చెప్తే లక్ష్యపెట్టడు సీతాపతి, కొంచెం కోపం తెచ్చుకుని, ఏమయినా అంటే, అమ్మా అమ్మా, నువ్వూ ఇంతేనా, ఎక్కడికయినా పారిపోవాలి; ఏ రైలు కిందయినా పడి......ఛఛ నలుగురిలోనూ ఎంత అపఖ్యాతి. అయినా ఖర్చు పెట్టటానికి

P. Murali Krishna

దశ్చేది, ఆయన చెప్పినట్టు వీడొక్కడే కాదుకదా, రెండవవాడి సూక్తులు ఫయిసలయిపోతూంది. పెద్దపిల్లకి పెళ్ళిచెయ్యాలి.——నిజంగా తనదే బుద్ధి తక్కువ. అప్పుడేనో సంబంధం నిశ్చయంచేసుకొని ఉండవలసింది. పెళ్ళు పెళ్ళాం అంటూఉంటె, పోనీ చదువుకాకపోతే ఏదయినా ఉద్యోగమయినా చేసుకుపోవాలని శ్రధ్ధపటును. అయినా అప్పుడు అంతలా తిరువీధులు తిరిగినట్టు వచ్చిన పెళ్ళిసంబంధాలవాళ్ళు ఇప్పుడు ఒక్కరూ రారు. ఏంఖర్మమో? ఇలా మథన పడి పడి చివరకి నిశ్చయం చేసుకొని భర్తను వెళ్ళి చెల్లెలుని అడగమంది. అతనీమారు ఖండితంగా చెప్పేశాడు. ఇదేదో ఆటలాగుంది. ఒకమారు నువ్వొవద్దని, ఒకమారు అది పనికి రాదని నీ యిష్టం వచ్చినట్టు చేసుకో. వాడి పూచీ నాకేం లేదన్నాడు.

ఎలాగైతేం నాలుగురోజులుతన ఆధీనంలోవున్న అస్త్రాలన్నీ ప్రయోగించి ఒప్పించింది భర్తను. ఇక తక్కిన సగం సులువే అనుకొంది. ఎంచేతంటే ఆవిడ నాలుగుచోట్ల ప్రయత్నించి ప్రయత్నించి కదా మాష్టరీ ట్రెయినింగుకి పంపించింది. ఇక నెన్నాళ్ళిలా పెళ్ళిలేకుండా మాష్టరీచేయిస్తుంది. అంచేత మరేం సందేహం లేదన్న నిబ్బరంతోనే బయలుదేరింది తాను ఈమారు భర్తనుకూడా తీసుకొని.

అక్కరలేని ప్రసంగాలన్నీ అయిన తరవాత జంటకవులవలె భార్యాభర్తలిద్దరూ ఆరంభించేరు. తమ కుర్రవాణ్ణి కూడా ట్రెయినింగుకి పంపే ఉద్దేశం ఉందనీ, అదృష్టం ఉంటే మాష్టరీ చేస్తూనే బి. యే. ప్యాసవ వచ్చునని ఇద్దరూ ఒక్కరకం ఉద్యోగాలు చేసుకొంటూ హాయిగా వేణ్ణీళ్ళకి చన్నీళ్ళతోడన్నట్టు వుండచ్చునని, ఎంత కట్నంఇస్తేనేం దూరపు సంబంధాలు దూరపువే. ఇలా అయిన సంబంధంతో సాటికి వస్తాయా అనీ అలా ఇద్దరూ చెప్పవలసినదంతా చెప్పారు. ఇకసరి ఈమెలో ఏముంది, అనుకొంటూ వుండగా సుభద్ర ఖచ్చితంగా చెప్పేసింది. 'నాకు కొడుకయినా కూతురైనా అది ఒక్కటే. దానికి ఇవతల ఉద్యోగం చేస్తూనే అవతల చదువుకోవాలని వుంది. కాక అది నాతో స్పషంగా చెప్పేసింది. నా పెళ్ళి సంగతి నువ్వేమీ తలపెట్ట వద్దు. తరువాత నీ మాట లెక్కచెయ్యలేదనుకొని లాభంలేదు. అదంతా నేనే చూసుకొంటాను అని స్పష్టంగా చెప్పేసింది, అదీ చదువుకొన్నది; జ్ఞానం వచ్చింది. నాకు నామేనల్లుడంటే ఇష్టం వుండచ్చును గాని, దానికి ఇష్టం

లేంది బలవంతం చెయ్యలేనుకదా, అని తను చెప్పవలసిందంతా అయిపోయిందన్నట్టు గట్టిగా పెదవులు బిగించుకు చూస్తోంది.

భార్యా భర్త లిద్దరినీ తెలుసుకుంటున్న అభ్యంతరమంతా తల్లిదేగాని కూతురిది కాదని. కాని, వాదించి ఆమాట ఒప్పించినందువల్ల ఏమీ ఫలితమూ లేదనీ తెలసి, ఇంటిమొగం పట్టేరు, ఏవేవో అప్రస్తుతమయిన సంగతులకుగాని ఉత్సాహం తెచ్చుకొని మాట్లాడుతూ.

౨

విద్యార్థినిగా వున్నంతకాలం స్కూలుకు నడిచివెళ్లినా ఉపాధ్యాయిని అయినతర్వాత రిక్షామీద స్కూలికి వెళ్తుండేది జానకి. ఇటీవల కొన్నాళ్ళుగా రోజూ ఒక సందుమలుపులో సీతాపతి కనిపించి, ఎంతో విచారకరమయిన దృశ్యాన్ని చూస్తున్నట్టు 'పాపం, ప్చ్' అనేవాడు.

రోజూ అదేసమయమప్పుడు అదేచోట తారసిల్లడం ఈరకంగా అనడం జానకికి చాలా కష్టమనిపించింది. అయినా ఇది ఎవరితో చెప్పుకోగలదు. చెప్పుకొన్నా ఏం బాగుంటుది? ఊఁహుఁ తానే ఒకనాడు బుద్ధిచెప్పా లనుకుంది.

ఆవేళ రిక్షా ఆపించి, 'ఏం నా గురించి అంత విచారించ వలసిందేమొచ్చింది?' అంది.

'ఇంతకంటే మరింకేం కావాలి. నువ్విలా రోజూ స్కూలుకి వెళ్తుండడమే. తనకిలేని సుఖం నీకుమాత్రం ఎందుకుండాలని కాబోలు మాఅత్త...'

'నాగురించేం నువ్వు విచారించ నక్కర్లేదు. నిన్ను చూస్తేనే కాదు తల్చుకొంటేనే నా కదోలాగుంది. చదువు సంధ్యాలేకుండా, ఉద్యోగంలేక ఇలా తిరుగుతూ దారంటపోయే ఆడవాళ్ళని చూసి ఏమిటో జాలిపడుతున్నట్లుగా ఇదొక కొత్తవేషం కాబోలు' అని రిక్షా నడిపించేసింది, అతని సమాధానం వినిపించుకోకుండా.

తరవాత కూడా రోజూ అతను అక్కడే తారసిల్లేవాడు. అయితే యిప్పుడు వెనకటిలా ఏమీ అనడంలేదు. ఒక్కమారు తలెత్తి చూసి తిరిగిపోయేవాడు.

ఆవేళ స్కూలు కామన్ రూములో ఏదో ఉగాది సంచిక చూస్తున్నారు. అందులో ఒక బొమ్మకి చాలావరకు జానకి పోలికలుందని కొందరు లేదని కొందరు. చర్చలంతా అయిపోయేక ఒంటరిగా కూర్చుని చూసింది. బొమ్మ పేరు దివ్యదర్శనము. బొమ్మల్లో వాళ్ళు మేడ అనుకొన్నది రిక్షా. దూరంగా ముష్టివాడని వాళ్ళన్నది అతనే అయితే జుత్తు మరింత చింపిరిగానూ గడ్డం పెరిగి కావాలని వికృతంగా చేసినట్టుంది. సందేహం లేదు, అతని పేరు ఆర్. యస్. పతి అని ఉంది.

మరునాడు నడిచే బయలు దేరింది స్కూలుకి. అతనికి రిక్షా లేకపోవడం కొంచెం ఆశ్చర్య కారణమయింది. కాని, ఏమీ అనకుండా తిరిగిపోతూ ఉంటే, 'బావా' అని పిలిచింది.

తీరా అతను దగ్గర కొచ్చేక ఏమీ మాటల్లేవు. అలా కొంత సేపు నిలబడ్డాక ఆమె 'నన్నేంచెయ్యమన్నావు' అంది. ఆ ఒక్క మాటతోనూ అతనికి అర్థమయి పోయింది. అతను 'మరే ఊళ్ళోనయినా ఉద్యోగం చెయ్యకూడదు?' అన్నాడు. 'దొరికితే చెయ్యడానికేమీ అభ్యంతరం లేదు' అంది.

ఆతరవాత ఒక అయిదురోజులు అతను కనబడలేదు. ఆవేళ ఒక అప్లికేషన్ ఫారము టైపు చేయించినది తీసి 'సంతకంపెట్టు' అన్నాడు. ఆరోడ్డు మీద నిలబడే ఆమె సంతకంపెట్టింది.

మరి వారం రోజులనాడు జానకి అమ్మతో "మాస్కూలులో మాస్టరు ఆవిడ వాళ్ళఊరు రమ్మంటోంది చాలా కాలమాయి. సోమవారంకూడా శలవు' అనిచెప్పి బయలుదేరింది. కాని, మంగళవారంనాటికి ఉత్తరం వచ్చింది. తాను వేరే ఊళ్ళో ఉద్యోగంలో ప్రవేసించినట్టు, పెళ్ళి కూడా రిజిస్ట్రేషను పద్ధతిని చేసుకొనేట్టున్న. ఈ ఉత్తరం పట్టుకుని గాభరాగా అన్నయ్యగారింటికి వెళ్ళేసరికి వాళ్ళకీ అప్పుడు సుమారు అటువంటిదే ఉత్తరం వచ్చింది వాళ్ళ పెద్దవాడి దగ్గరనుండి. తానొక కో ఆపరేటివ్ బ్యాంకులో గుమాస్తాగా ప్రవేసించినట్టు, అక్కడికి కొత్తగా స్కూలు మాస్టరుగా వచ్చిన ఒక అమ్మాయిని పెళ్ళి చేసుకోడానికి నిశ్చయించుకున్నట్టు, అందాకా మొదటి నెల జీతం అందేలోపుని ఖర్చుకి ఒక యాభై పంపవలసిందని. మరేముంది రెండు ఉత్తరాలు కలిపి చూస్తే వడ్లగింజలో బియ్యపుగింజ అంతా తేలిపోయింది.

తమ తమ మనోభావాలు ఎల్లావున్నా కాగల కార్యం గంధర్వులే చేశారనీ, ఏమయినా అయిన సంబంధం సాటి ఇంకొకటవుతుందా అనీ,

ఆ కళ్యాణ ఘడియలు వచ్చినప్పుడు అలా జరిగిపోక తప్పదనీ, ఒక తరఫున పెద్ద కొడుకు, ఇంకోవేపు ఒక్కగా నొక్క కూతురు, అటువంటిది సలక్షణంగా పెళ్ళికాక కోర్టులో పెళ్ళి ఏమిటని అనుకుంటూ నాటి రాత్రి రయిలుకే బయలుదేరారు.

కాని, తరవాత చాలా కాలంవరకు సుభద్రమ్మకు తనమీద కోపం కొద్దీ సుందరి తన కొడుకుకి ప్రోద్బలంచేసి తనను వంచన చేసిందని, లేకుంటే తన జానకి తనకు తెలియకుండా అంత సాహసం చేస్తుందా అని అనుమానం ఉండేది. కాని, కొన్ని కొన్ని సందర్భాలలో తనకంటె తన మొగుడే ఎక్కువవాడయినట్లుగా జానకి ప్రవర్తించటంతో సుభద్రమ్మ పూర్తిగా భక్తురాలయి తీర్థయాత్రలకి బయలుదేరింది.